సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)
సోమవారం | 12 | జూన్ | 2023



పత్తి రైతు.. పరేషాన్ వద్దు
పత్తి రైతులు మార్కెట్‌లో వ్యాపారులు సృష్టించే గందరగోళంతో పరేషాన్ కాకుండా జాగ్రత్తగా విత్తనాలను ఎంపిక చేసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. - 8లో▸



వినియోగదారుల రక్షణే ధ్యేయం
వినియోగదారుల హక్కుల పరిరక్షణే ధ్యేయమని కన్స్యూమర్ కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్ అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$40^0 / 27^0$

వాతావరణం
ఉదయం పొడివాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి సమయంలో ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నేటినుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

విద్యారణ్యపురి: ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 20వ తేదీ వరకు జరిగే ఈ పరీక్షలకు జనరల్, ఒకేషనల్ కోర్సులు కలిపి జిల్లాలో 16,488 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. పరీక్షల నిర్వహణకు 38 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్కో సెంటర్‌కు ఒక చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటల్ ఆఫీసర్‌ను నియమించారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు ఉంటాయని హనుమకొండ డీఐఈఓ ఎ.గోపాల్ తెలిపారు. పరీక్షల నిర్వహణను పర్యవేక్షించేందుకు రెండు ఫ్లయింగ్‌స్క్వాడ్లు, మూడు సిట్టింగ్ స్క్వాడ్లను నియమించామని, విద్యార్థులు నిర్దేశించిన సమయానికి ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని ఒక ప్రకటనలో సూచించారు.

నేడు గ్రేటర్ వరంగల్ గ్రీవెన్స్

వరంగల్ అర్బన్: వరంగల్ మహా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం కౌన్సిల్ హాల్‌లో సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ అడిషనల్ కమిషనర్ అనిసుర్ ఉర్ రషీద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రాతపూర్వకంగా దరఖాస్తులు స్వీకరిస్తామని, నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి కలెక్టరేట్ల గ్రీవెన్స్‌లు రద్దు

హన్మకొండ/కరీమాబాద్: హనుకొండ, వరంగల్ కలెక్టరేట్లలో సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమాలను రద్దు చేసినట్లు ఆయా జిల్లాల కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల నేపథ్యం, పరిపాలనా పరమైన కారణాలతో ఈ నిర్ణయం తీసుకున్నామని, ప్రజలు గమనించి వినతులతో కార్యాలయాలకు రావొద్దని కోరారు.

నేటి పోలీస్ గ్రీవెన్స్ కూడా..

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌ను అనివార్య కారణాలతో రద్దు చేస్తున్నట్లు సీపీ ఏవీ.రంగనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ఫిర్యాదుదారులు గమనించాలని కోరారు.

హోరాహోరీగా ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు



కేయూ క్యాంపస్: యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో టీవీ ఆర్టిస్టులు, సీనియర్ క్రీడాకారుల జట్ల మధ్య హనుమకొండ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ఆదివారం రాత్రి 10 గంటలకు హోరాహోరీగా జరిగాయి. సినీ, టీవీ ఆర్టిస్టుల జట్టుకు సినీ నటుడు రాజీవ్ కనకాల కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నారు. ఆ జట్టు బ్యాటింగ్ చేసింది. ఈ మ్యాచ్ ముగిసిన తర్వాత హనుమకొండ ప్రీమియర్ లీగ్ క్రికెట్ ఫైనల్ పోటీలు వైభవ్ గైక్వాడ్ ఐపీఎస్ 11 జట్టు వర్సెస్ డాల్ఫిన్ క్రికెట్ క్లబ్ జట్ల మధ్య నిర్వహించనున్నారు. ఈ నెల 1 నుంచి హనుమకొండ సీనియర్ క్రికెట్ క్రీడాకారుల ఆధ్వర్యంలో ప్రీమియర్ లీగ్ పోటీలు నిర్వహిస్తున్నారు. చీఫ్ ఆర్గనైజర్‌గా మహ్మద్ అబ్దుల్‌ఖుద్దూస్, చీఫ్ అడ్వైజర్, క్రికెట్ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ కార్యదర్శి ఉదయభాను రావు, క్రీడాకారులు పాల్గొన్నారు.

విద్యార్థులే పునాదులు



నర్సంపేట: రేపటి సమాజానికి విద్యార్థులే పునాదులని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ బన్న ఐలయ్య అన్నారు. నర్సంపేటలోని విజ్‌డమ్ హైస్కూల్‌లో పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఆదివారం తెలంగాణ మాల మహానాడు ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అందించి సన్మానించారు. ఈసందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ.. తెలంగాణ మాల మహానాడు ఇలాంటి కార్యక్రమాలతో యువకులు, విద్యార్థులకు జీవిత లక్ష్యాలు గుర్తు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి గుంటి వీర ప్రకాశ్, తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పసుల రామ్మూర్తి, ప్రొఫెసర్ డాక్టర్ గద్ద వెంకటేశ్వర్లు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు బందెల యాదలక్ష్మి, రిటైర్డ్ ఎంఈఓ గంజి లక్ష్మీనారాయణ, గుంటి శ్రీనివాస్, దార గణేశ్, బొట్ల కేదారి, నూనె పద్మ, గద్ద శ్రీనివాస్, గొర్రె సాంబయ్య, జిల్లా అధ్యక్షుడు ఉసిల్ల దయాకర్, మండల అధ్యక్షుడు గద్ద ఎల్లయ్య, పట్టణ అధ్యక్షుడు గునిగంటి ఈశ్వర్, ఉద్యోగ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కప్పల కుమారస్వామి, గొర్రె రామస్వామి, కునమల్ల పృథ్వీరాజ్, గుంటి చక్రపాణి పాల్గొన్నారు.

మోగనున్న బడి గంట

నేటి నుంచి పాఠశాలల పునఃప్రారంభం

- జిల్లాకు 85 శాతం పాఠ్యపుస్తకాలు రాక
- స్కూల్ యూనిఫాం పంపిణీకి ఏర్పాట్లు
- ఈసారి విద్యార్థులకు ఉచిత నోట్‌బుక్స్
- పిల్లలను సిద్ధం చేస్తున్న తల్లిదండ్రులు



విద్యారణ్యపురి: వేసవి సెలవుల్లో ఆటపాటలతో గడిపిన విద్యార్థులు బడిబాట పట్టనున్నారు. విద్యా క్యాలెండర్ ప్రకారం సోమవారం నుంచి బడిగంట మోగనుంది. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మార్కెట్‌లో పుస్తకాలు, స్కూల్ యూనిఫాం, బ్యాగుల కొనుగోళ్లు ఊపందుకుంటున్నాయి. ఈసారి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలతో పాటు నోట్‌బుక్స్ ఉచితంగా అందించనున్నారు. అలాగే, స్కూల్ యూనిఫాం ఇవ్వనున్నారు. పాఠశాలల పునఃప్రారంభంపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

85 శాతం ఉచిత పాఠ్యపుస్తకాలు..

హనుమకొండ జిల్లాలో 492 ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలు, 9 కేజీబీవీలు, మూడు మోడల్ స్కూళ్లు, మూడు టీఎంఎస్, ఒక యూఆర్‌ఎస్, మూడు టీఆర్‌ఈఐఎస్, 28 గురుకుల పాఠశాలలున్నాయి. వీటిలో మొత్తం 54,953 మంది విద్యార్థులున్నారు. 1 నుంచి 10వ తరగతి వరకు 85 శాతం ఉచిత పాఠ్యపుస్తకాలు వచ్చాయి. 1 నుంచి 5వ తరగతి పాఠ్యపుస్తకాలు ఇంకా సగం వరకు రావాల్సి ఉండగా.. మిగిలిన టైటిల్స్ పుస్తకాలు వచ్చిన తర్వాతే స్కూల్ పాయింట్లకు తీసుకెళ్లే అవకాశాలు ఉన్నాయి. హనుమకొండ, కమలాపూర్, హసన్‌పర్తి, కాజీపేట మండలాల్లోని హెచ్‌ఎంలు 6 నుంచి 10వ తరగతి వరకు వచ్చిన పాఠ్యపుస్తకాలు స్కూల్ పాయింట్లకు తీసుకెళ్లారని ఆ మండలాల ఎంఈఓ రాంకిషన్‌రాజు తెలిపారు.

40 వేల నోట్‌బుక్స్..

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచితంగానే నోట్‌బుక్స్ అందించాలని విద్యాశాఖ నిర్ణయించింది. జిల్లా కేంద్రానికి ఇప్పటివరకు 40వేల నోట్ బుక్స్ చేరాయి. ఇంకా 1.76 లక్షల నోట్ బుక్స్ వచ్చిన తర్వాతే పంపిణీ చేయనున్నారు.

స్కూల్ యూనిఫాం..

జిల్లాలోని 42,304 మంది విద్యార్థులకు స్కూల్ యూనిఫాం క్లాత్ కొద్ది రోజుల క్రితమే మండలాల హెచ్‌ఎంలకు వచ్చింది. పాఠశాలల హెచ్‌ఎంలు దర్జీలతో కుట్టిస్తున్నారు. మొదట ఒక్కో జత విద్యార్థులకు ఇవ్వనున్నారు. వారం పది రోజుల్లో మరో జత కూడా అందించనున్నారు. ఒక్కో జతకు రూ.50 చొప్పున కుట్టుకూలి చెల్లిస్తామనడంతో కొన్నిచోట్ల దర్జీలు ముందుకు రాలేదని తెలిసింది.

స్కావెంజర్ల నియామకమేది?

ప్రభుత్వ పాఠశాలలను శుభ్రం చేసేందుకు స్కావెంజర్లను ప్రభుత్వం నియమించడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ సిబ్బంది, పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కార్మికులు పాఠశాలలను శుభ్రం చేయాల్సి ఉటుందని ప్రభుత్వం చెబుతున్నా ఆచరణలో సాధ్యం కావడం లేదు.

318 టీచర్ పోస్టుల ఖాళీ

జిల్లాలో అన్ని కేటగిరీ టీచర్ల పోస్టులు 2, 693 కాగా అందులో 2,375 మంది పనిచేస్తున్నారు. 318 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అంతేకాకుండా హెచ్‌ఎం పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయి. ఒక్కో ఎంఈఓ నాలుగైదు మండలాలకు కూడా ఇన్‌చార్జ్‌గా ఉన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులు..

జిల్లాలోని 315 ప్రైవేటు పాఠశాలల్లో 80,285 మంది విద్యార్థులు చదువుతున్నారు. బడ్జెట్ పాఠశాలల్లో కొంత తక్కువగా ఫీజులు ఉండగా మిగిలిన వాటిలో అధికంగానే ఫీజులు వసూలు చేస్తున్నారు. కరోనా సమయంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగింది. గత ఏడాది నుంచి మళ్లీ కొందరు ప్రైవేటు పాఠశాలలకు వెళ్తున్నారు.

వరంగల్‌లో..

కాశీబుగ్గ సెంటర్: వరంగల్ జిల్లాలో అన్ని రకాల ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు 1,025 ఉన్నాయి. ఇందులో ప్రైవేట్, ప్రభుత్వ, వివిధ గురుకుల విద్యాలయాలను కలుపుకొని సుమారు 1,26,049 మంది విద్యార్థులు(పాత యూడైస్ ప్రకారం) అడ్మిషన్లు పొంది ఉన్నారు. మన ఊరు మన బడి/ మన బస్తీ మన బడి మొదటి విడతలో 223 పాఠశాలలను ఎంపిక చేశారు. వీటిలో 27 పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తి చేసినట్లు రికార్డులు చెబుతున్నాయి. అదే విధంగా జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 54,841 మంది ఉండగా.. వీరికి 3,17,592 అన్నీ టైటిల్స్ కలుపుకొని 2,48,242 పుస్తకాలు జిల్లా కేంద్రానికి చేరుకున్నాయి. మొదటి విడతలో 1,79,199 పుస్తకాలు సుమారు 72 శాతం మాత్రమే మండల కేంద్రాలకు పంపిణీ చేశారు. పూర్తి స్థాయిలో పాఠ్యపుస్తకాలు రాకపోవడంతో మొక్కుబడిగానే పాఠ్యపుస్త కాలు విద్యార్థుల చేతుల్లో పెట్టనున్నారు. బడిబాటలో భాగంగా ఉపాధ్యాయులు 3,635 మంది పిల్ల లను గుర్తించి పాఠశాలల్లో చేర్పించినట్లు అధికారులు చెప్పుతున్నారు. కాగా.. జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు 452, పాథమికోన్నత పాఠశాలలు 68, ఉన్నత పాఠశాలలు 125 ఉన్నాయి. ఏయే పాఠశాలల్లో ఎంతమందిని చేర్పించారనే సమాచారం అధికారుల వద్ద లేదని తెలిసింది. గతంలో పిల్లలు లేకపోవడంతో జీరో స్కూల్స్ సుమారు 85 మూతపడ్డా యి. ఈఏడాది పాఠశాలలను పునఃప్రారంభించేలా చర్యలు తీసుకోలేక పోయినట్లు సమాచారం.

బుజ్జగించి పంపాల్సిందే..



మాది హనుమకొండ. ముగ్గురు పిల్లలను ఓ ప్రైవేటు పాఠశాలలో చదివిస్తున్నా. తొలిరోజు మారాం చేస్తారు కాబట్టి వారిని బుజ్జగించి పంపిస్తాం. రూ.13 వేలతో పుస్తకాలు, రూ.8 వేలతో యూనిఫాం, షూ, సాక్స్‌లు, బెల్టులు కొనుగోలుచేశా. శ్రీపలకు రూ.37 వేలు, అద్వైతకు రూ.33 వేలు, ద్రోణకు గత ఏడాది నర్సరీకి రూ.37 వేల ఫీజు తీసుకున్నారు. ఫీజులు భారమైనా కానీ మంచి విద్య అందిస్తేనే పిల్లల భవిష్యత్ బాగుంటుందని నా అభిప్రాయం. నేను చిరుద్యోగిని, కొంత వ్యవసాయం ఉండడంతో నెట్టుకొస్తున్నా. – రవి, హనుమకొండ

ముందుగానే సిద్ధం చేశా..



నా కుమారుడు మోక్షిత్‌రాఘవ్ కాజీపేటలోని ఓ మిషనరీస్ స్కూల్‌లో ఐదో తరగతి చదువుతున్నాడు. సోమవారం పాఠశాలకు పంపించేందుకు ముందుగానే మానసికంగా సిద్ధం చేశాం. రూ.30 వేల స్కూల్ ఫీజు ఉంది. పాఠ్యపుస్తకాల కోసం రూ.2,800 ఖర్చు అవుతుంది. స్కూల్ యూనిఫాం, షూ, బ్యాగ్ బెల్టు, సాక్స్‌లకు రూ 2వేలకుపైగా ఖర్చయ్యింది. ఫీజుల భారం తప్పదు. నాణ్యమైన విద్యనందిస్తేనే పిల్లలు పైచదువుల్లో కూడా రాణిస్తారు. స్కూళ్ల ఫీజులే కాదు అన్ని రకాల వస్తువుల ధరలు కూడాపెరిగిపోవడంతో భారంగా మారింది. – బి వెంకటగోపీనాథ్, హనుమకొండ

గ్రూప్-1 ప్రిలిమినరీ ప్రశాంతం



హనుమకొండ : పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్



గ్రీన్‌వుడ్ స్కూల్‌లో అధికారులతో మాట్లాడుతున్న వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య

- పరీక్షకు 66.21 శాతం మంది హాజరు
- తనిఖీ చేసిన కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య
- నిబంధనల అమలుపై నిశిత పరిశీలన

హన్మకొండ: టీఎస్ పీఎస్సీ గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. 21,038 అభ్యర్థుల కోసం హనుమకొండలో ఏర్పాటు చేసిన 55 పరీక్ష కేంద్రాల్లో 13,929 మంది(66.21 శాతం) పరీక్ష రాశారు. ఉదయం 10.30 నుంచి ఒంటిగంట వరకు జరిగిన పరీక్ష తీరును పలు సెంటర్లలో కలెక్టర్ సిక్తా పట్నాయక్ పరిశీలించారు. అభ్యర్థులు, సిబ్బంది హాజరు ఇతర వివరాలను తెలుసుకున్నారు. నిబంధనలకు అనుగుణంగా నిర్ణీత సమయంలో ప్రశ్నపత్రాలను తెరిచారా? లేదా? అన్నది నిర్ధారణ చేసుకున్నారు. గదుల్లో అభ్యర్థులకు అందుబాటులో ఉంచిన సదుపాయాలను గమనించి ముఖ్య పర్యవేక్షకులకు సూచనలు చేశారు. మరో వైపు అదనపు కలెక్టర్ సంధ్యారాణి పలు కేంద్రాలను సందర్శించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

వరంగల్‌లో..

కరీమాబాద్: గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష కేంద్రాలను వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య సందర్శించారు. ఆయా సెంటర్లలో కల్పించిన సదుపాయాలు పరిశీలించారు. అధికారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు.

ఆకర్షణీయ నగరాలే ప్రధాని లక్ష్యం

- కేంద్ర మంత్రి బీఎల్.వర్మ



వేయిస్తంభాల ఆలయం వద్ద కేంద్రమంత్రి బీఎల్.వర్మ

హన్మకొండ కల్చరల్/వరంగల్ అర్బన్: ఆకర్షణీయ నగరాలుగా రూపుదిద్దుకోవాలనేది ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యమని, ఆ దిశగా అధికారులు పని చేసి అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలకు అందించేందుకు కృషి చేయాలని కేంద్ర సహకార, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ మంత్రి బీఎల్.వర్మ అన్నారు. హనుమకొండలోని 'కుడా' కార్యాలయంలో ఆదివారం స్మార్ట్‌సిటీ పనుల పురోగతిని సమీక్షించి, వేయిస్తంభాల ఆలయంలో చేపట్టిన కల్యాణ మండపం పనుల పురోగతిని పరిశీలించారు. నగరంలో స్మార్ట్‌సిటీ ప్రాజెక్టుల పురోగతిపై మంత్రికి సీఈఓ, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ స్మార్ట్‌సిటీ పనులపై 15 రోజులకోసారి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ ప్రతినిధులు సమీక్షిస్తారని చెప్పారు. సమావేశంలో బల్దియా ఎస్‌ఈ ప్రవీణ్ చంద్ర, ఈఈ శ్రీనివాస్, డీఈలు రవికుమార్, రవికిరణ్, సారంగం, ఏఈలు అజ్మీరా శ్రీకాంత్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే.. వేయిస్తంభాల ఆలయాన్ని సందర్శించిన కేంద్ర మంత్రి రుద్రేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయంలో చేపట్టిన కల్యాణ మండపం పునర్నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. గతంలో కేంద్రం రూ.15 కోట్ల నిధులు కేటాయించిందని, అవసరమైతే మరిన్ని నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. స్థపతి అనారోగ్యం కారణంగా పనులు నిలిచిపోయాయని పురావస్తుశాఖ అధికారి మల్లేశం తెలిపారు. హృదయ్ పథకం కింద నగరానికి రూ.40.54 కోట్ల నిధులు మంజూరయ్యాయని అన్నారు. మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు పద్మ, రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి, బాబు, సుదర్శన్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

హన్మకొండ: భారతీయ జనతా పార్టీలో అనుబంధ మోర్చాల పాత్ర ప్రముఖమైందని కేంద్ర మంత్రి బీఎల్.వర్మ అన్నారు. హనుమకొండ హంటర్ రోడ్డులోని వేద బాంక్వెట్ హాల్‌లో హనుమకొండ జిల్లా బీజేపీ అనుబంధ మోర్చాల సంయుక్త సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు. అధ్యక్షురాలు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శితోపాటు జిల్లా ఇన్‌చార్జ్ వి.మురళీధర్ గౌడ్, ధర్మారావు, శ్రీనివాస్‌రెడ్డి, రాకేష్‌రెడ్డి, తాళ్లపల్లి కుమారస్వామి, కందగట్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార రంగం అభివృద్ధికి కృషి

వరంగల్: దేశంలో వ్యాపార రంగం అభివృద్ధికి బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తున్నదని కేంద్రం మంత్రి వర్మ అన్నారు. వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం చాంబర్ పాలక వర్గ సమావేశం నిర్వహించారు. కేంద్ర మంత్రి హాజరై మాట్లాడారు. చాంబర్ బాధ్యులు మొగలి చంద్రమౌళి, సాగర్ల శ్రీనివాస్, అల్లే సంపత్ తదితరులు పాల్గొన్నారు.

రాలిన పోరాట కుసుమం

జెడ్పీ చైర్మన్ జగదీశ్ హఠాన్మరణం

- నివాళులర్పించిన బీఆర్‌ఎస్ శ్రేణులు
- సంతాపం తెలిపిన ప్రజాప్రతినిధులు



నివాళులర్పిస్తున్న మంత్రి ఎర్రబెల్లి, ఎమ్మెల్సీ కడియం



కుసుమ జగదీశ్ మృతదేహం



కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న ఎమ్మెల్యే సీతక్క

ములుగు: బీఆర్‌ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్, జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్వర్(47) గుండెపోటుతో మృతిచెందారు. దీంతో కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు విషాదంలో మునిగిపోయారు. హనుమకొండ స్నేహనగర్‌లోని స్వగృహంలో ఉండగా ఆదివారం ఉదయం ఆయనకు గుండెనొప్పి రావడంతో గుర్తించిన కుమారుడు వెంకట సత్యదేవ్, సోదరుడు కన్నయ్య, గన్‌మెన్ కలిసి జగదీశ్వర్‌ను లైఫ్‌లైన్ ఆస్పత్రికి.. అక్కడి నుంచి ములుగు రోడ్డులోని అజర ఆస్పత్రికి తరలించారు. ఐసీయూలో చికిత్స పొందుతూనే తుదిశ్వాస విడిచినట్లు వైద్యులు ప్రకటించారు. ఇదిలా ఉండగా.. గత నెలలో జగదీశ్వర్‌కు మైల్డ్ స్ట్రోక్ రావడంతో అజర ఆస్పత్రిలో వారం రోజులు చికిత్స పొందారు. అనంతరం నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. కుసుమ జగదీశ్ బ్రెయిన్ స్ట్రోక్‌తో మరణించినట్లు ప్రచారం జరుగుతోంది.

తరలివచ్చిన పార్టీ శ్రేణులు

జెడ్పీ చైర్మన్ మృతి చెందారనే వార్త సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న పార్టీ శ్రేణులు ఆస్పత్రి వద్దకు చేరుకుని.. మృతదేహాన్ని చూసి తమ నాయకుడు ఇక లేడని కన్నీటి పర్యంతమయ్యారు. జగదీశ్వర్ మృతి విషయం పార్టీ శ్రేణుల ద్వారా తెలుసుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్ దిగ్భ్రాంతి చెంది ప్రగాఢ సానుభూతి తెలిపారు. మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి, జలవనరుల సంస్థ చైర్మన్ వీరమల్ల ప్రకాశ్, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్, మాజీ మంత్రి చందూలాల్ తనయుడు అజ్మీరా ప్రహ్లాద్, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, రెడ్కో చైర్మన్ ఏరువ సతీశ్‌రెడ్డి, జెడ్పీటీసీ సకినాల భవాని, ఎంపీపీ గండ్రకోట శ్రీదేవి, ఆయా మండలాల అధ్యక్షులు, నాయకులు పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జగదీశ్వర్ మృతదేహాన్ని చూసి రాష్ట్ర గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ కన్నీటి పర్యంతమయ్యారు. ఎమ్మెల్యే సీతక్క ఆస్పత్రికి చేరుకొని నివాళులర్పించారు. పార్థివ దేహాన్ని మల్లంపల్లికి తరలించగా ఆమె వెంట వచ్చారు.

నేలకొరిగిన ఉద్యమ నేత

ములుగు మండలం మల్లంపల్లికి చెందిన ఆదినారాయణ–సులోచన దంపతులకు జగదీశ్వర్ నాలుగో సంతానం. ఆయనకు భార్య రమ, కుమారుడు వెంకట సత్యదేవ్, కూతురు హరిచందన ఉన్నారు. 1991లో మల్లంపల్లి పాఠశాలలో 10వ తరగతి చదివిన జగదీశ్వర్.. తొలి నుంచి తెలంగాణ ఉద్యమ కారుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. కళాశాల చదువు సమయంలో విశ్వ భారత్ యూత్‌ను ప్రారంభించి గుడుంబా, గుట్కా నియంత్రణపై ఉద్యమాలను మొదలు పెట్టారు. సైకిల్ యాత్ర నిర్వహించి అప్పటి సీఎం చంద్రబాబునాయుడు వరకు వెళ్లారు. 2001 తెలంగాణ ఉద్యమ సమయంలో యూత్ ఆర్గనైజేషన్‌లో పని చేయడంతో పాటు అనేక నిరసన కార్యక్రమాలను చేపట్టి కేసీఆర్ దృష్టిలో పడ్డారు. 2001కి పూర్వం విప్లవ పార్టీలో కూడా పనిచేశారు. తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భవించిన తర్వాత 2014 వరకు ఉద్యమాల్లో పాల్గొన్నారు. తెలంగాణ సిద్ధించాక జగదీశ్వర్ సీఎం కేసీఆర్‌కు దగ్గరయ్యారు. 2019 ఆగస్టులో జరిగిన ఎన్నికల్లో ఏటూరునాగారం నుంచి జెడ్పీటీసీగా గెలుపొందా రు. అనంతరం కేసీఆర్ ఆశీర్వాదంతో ములుగు జెడ్పీ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఆ తర్వాత బీఆర్‌ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడిగా, ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు చేపట్టారు.

నేడు అంత్యక్రియలు .. రానున్న కేటీఆర్

జగదీశ్వర్ స్వగ్రామం ములుగు మండల పరిధి మల్లంపల్లిలో అంత్యక్రియలు సోమవారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఉదయం 9.30 గంటలకు మంత్రి కేటీఆర్ చాపర్ ద్వారా ములుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చేరుకుంటారు. అక్కడి నుంచి జగదీశ్వర్ పార్థివ దేహానికి నివాళులర్పిస్తారు. అనంతరం అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తారు.

దిగ్భ్రాంతికి గురి చేసింది..

హన్మకొండ: ములుగు జెడ్పీ చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కుసుమ జగదీశ్వర్ ఆకస్మిక మరణం దిగ్భ్రాంతికి గురి చేసింది. చిన్న వయస్సులో గుండెపోటుతో మృతి చెందడం కలచివేసింది. తెలంగాణ ఉద్యమ సహచరుడు, అత్యంత సన్నిహితుడు ఇకలేకపోవడం కలచివేస్తోంది. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలి. కుసుమ జగదీశ్వర్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా.
– దాస్యం వినయ్‌భాస్కర్, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్

ఉద్యమ వీరుడికి జోహార్లు..

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన పోరా టంలో సహచర ఉద్యమకారుడు, కుసుమ జగదీశ్వర్ అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆయ న ఇక లేడనే విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నా. ఆయన మృతి బీఆ ర్ఎస్ పార్టీకి, ములుగు జిల్లా ప్రజలకు తీరని లోటు. ఓ మంచి మిత్రుడిని కోల్పోయాను. జగదీశ్వర్ మృతికి సంతాపం. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి. జగదీశ్వర్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నా.
– వై.సతీష్‌రెడ్డి, టీఎస్ రెడ్కో చైర్మన్

పార్టీకి తీరని లోటు..

ములుగు జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్వర్ మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటు. రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన నాయకుడి మరణం ఎంతగానో కలచివేసింది. సహచర జెడ్పీ చైర్మన్‌గా ఎన్నో ఆలోచనలు, అభిప్రాయాలు పంచుకునేవారం. ఆయన మృతికి సంతాపం. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా.
– డాక్టర్ మారపల్లి సుధీర్‌కుమార్, వరంగల్ అర్బన్ జెడ్పీ చైర్మన్

సాహితీ రంగానికి ప్రాధాన్యత

- వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య



వరంగల్‌లో రచయితను సన్మానిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

కరీమాబాద్: తెలంగాణ ప్రభుత్వం కవులు, కళాకారులు, సాహితీ వేత్తలకు ప్రాధాన్యత ఇస్తున్నదని వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వరంగల్ ఐఎంఏ హాల్‌లో నిర్వహించిన సాహిత్య దినోత్సవంలో కవులను సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళనంలో కవులు, రచయితలు, సాహితీవేత్తలు తమ రచనలతో అలరించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, ఆర్డీఓ మహేందర్‌జీ, డీఈఓ వాసంతి తదితరులు పాల్గొన్నారు.

కవులు, కళాకారుల పాత్ర మరువలేనిది: హన్మకొండ జిల్లా కలెక్టర్

హన్మకొండ కల్చరల్: తెలంగాణ ఉద్యమంలో కవులు, కళాకారుల పాత్ర మరువలేనిదని, వారిని సత్కరించుకోవడానికే సాహిత్య దినోత్సవం ఏర్పాటు చేసినట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయలో తెలంగాణ సాహిత్య దినోత్సవం నిర్వహించారు. ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, డీఆర్వో వాసుచంద్ర, డీఎండబ్ల్యూఓ శ్రీను, డీఈఓ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పలుగులలో యువకుడి ఆత్మహత్య

● చనిపోయే ముందు స్నేహితుడికి వీడియో కాల్


రాజయ్య (ఫైల్)

కాళేశ్వరం : తాను చనిపోతున్నానని ఓ యువకుడు స్నేహితుడికి వీడియోకాల్ చేసి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం పలుగులలో జరిగింది. ఎస్సై లక్ష్మణ్‌రావు కథనం ప్రకారం రెండు రోజుల నుంచి ముత్యాల రాజయ్య(27) మద్యం సేవించి ఇంటికి వస్తున్నాడు. దీంతో అతని భార్య మానస రోజు ఎందుకు సేవిస్తున్నావని ప్రశ్నించగా ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో రాజయ్య ఆదివారం మంచిర్యాల జిల్లా చెన్నూర్‌కు వెళ్లాడు. సాయంత్రం వచ్చి గ్రామంలోని తన స్నేహితుడు మానెం సాగర్‌కు సెల్ఫీ వీడియోకాల్ చేసి తాను చనిపోతున్నానని పురుగుల మందు తాగాడు. అనంతరం ఇంటికి వచ్చి కింద పడిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేస్తుండగా మృతి చెందాడు. దీనిపై మృతుడి సోదరుడు ముత్యాల సంపత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళ ఆత్మహత్య

వరంగల్ క్రైం: సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలోని వికాస్‌నగర్‌కు చెందిన పల్లె శ్యామల (42) ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. రెండు నెలల క్రితం పెద్ద కూతురు ప్రేమ వివాహం చేసుకున్నప్పటి నుంచి మానసికంగా కుంగిపోయింది. ఈ నేపథ్యంలో ఆదివారం ఆత్మహత్యకు పాల్పడిందని ఇన్‌స్పెక్టర్ షుకూర్ తెలిపారు. ఘటనపై మృతురాలి భర్త పల్లె శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఇనుగుర్తిలో రైతు..


శ్యామ్ మృతదేహం

కేసముద్రం: పురుగుల మందు తాగి ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదివారం ఇనుగుర్తి మండల కేంద్రంలో జరిగింది. స్థానికులల కథనం ప్రకారం గ్రామానికి చెందిన సంగెం శ్యామ్(35) ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. సాయంత్రం వరకూ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలిస్తూ, తమ పంటచేను వద్దకు వెళ్లారు. అక్కడ పురుగుల మందు తాగి శ్యామ్ ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. కాగా ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు. ఎస్సై తిరుపతిని వివరణ కోరగా ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.


దుగ్గొండి: పత్తి అచ్చుతోలుతున్న రైతులు (ఫైల్)


పత్తి విత్తనాలు నాటుతున్న కూలీలు (ఫైల్)

పత్తి రైతు.. పరేషాన్ వద్దు

● వ్యాపారులు సృష్టించే గందరగోళంతో మోసపోవద్దు
● సాగులో విత్తన ఎంపిక కీలకం
● అదను..పదను చూసుకోవాలి
● జిల్లా వ్యవసాయ అధికారి ఉషాదయాళ్

దుగ్గొండి : అన్నదాతలు ఖరీఫ్‌కు సమాయత్తమవుతున్నారు. మండుటెండలోనూ మాడ మండుతున్నా దుక్కులు సిద్ధం చేసుకుంటున్నారు. సకాలంలో వరుణుడు కరుణిస్తే విత్తనం నాటేందుకు రెడీ అవుతున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ సాగులో విత్తన ఎంపిక చాలా కీలకం. ఇక్కడే రైతు జాగ్రత్తగా ఉండాలి. ఏమాత్రం ఏమురుపాటున్న పంట మొత్తం నష్టపోయి పెట్టుబడులు కూడా రాని పరిస్థితి ఉంటుంది. ఈ నేపథ్యంలో మార్కెట్‌లో వ్యాపారులు సృష్టించే గందరగోళంతో రైతులు పరేషాన్ కావొద్దని జిల్లా వ్యవసాయ అధికారి ఉషాదయాళ్ పేర్కొన్నారు. వానాకాలం సీజన్‌లో పత్తి విత్తనాలు నాటడం, విత్తనాల ఎంపికపై రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె వివరించారు.

తేమ లేకుండా విత్తనాలు నాటొద్దు..

పత్తిపంటను వర్షాధారంగా గాని, నీటి పారుదల కిందగాని సాగు చేయొచ్చు. నేలను పలుమార్లు లోతుకు దున్ని అందులో పశువుల ఎరువుగాని, కోడి ఎరువుగాని వేయాలి. 60–65 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అనంతరం పత్తి విత్తనాలు నాటుకోవాలి. తేమ లేకుండా విత్తనాలు నాటితే సరిగ్గా మొలకెత్తవు. దీంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. భాస్వరం ఎరువులను నేలలోనే వేసుకోవాలి.

విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు..

రైతులు పత్తి విత్తనాలను జాగ్రత్తగా ఎంపిక చేసుకోవాలి. గత 2–3 సంవత్సరాల కాలంలో తమ ప్రాంతంలో ఏ రకం విత్తనాలు అధిక దిగుబడులు ఇచ్చాయో వాటినే ఎంపిక చేసుకోవాలి. విత్తన లైసెన్స్‌లు ఉన్న డీలర్ల వద్దే కొనుగోలు చేయాలి. బిల్లు తీసుకోవాలి. బిల్లులో విత్తన వివరాలు సరిగ్గా ఉన్నాయో లేదో చూసుకోవాలి. పంట చేతికి వచ్చే వరకూ బిల్లును దాచిపెట్టుకోవాలి. లూజు, గుడ్డ సంచులలో వచ్చే విత్తనాలను కొనుగోలు చేయొద్దు. వీటిని ఎవరైనా అమ్మితే వ్యవసాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలి. విత్తన ప్యాకెట్‌పై ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే పూర్తి వివరాలు వస్తాయి. వాటిని పరిశీలించాలి.

అంతర పంటల సాగు...

పత్తిలో అంతర పంటలుగా పెసర, మినుము, కంది సాగు చేసుకోవాలి. అంతర సాగు వల్ల పంటకు పెనుబంక, తెల్లదోమ, పచ్చదోమ ఉధృతి ఉండదు.

అధిక సాంద్రత సాగు.. దిగుబడి బాగు..

పత్తిని అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేస్తే దిగుబడి గణనీయంగా పెరుగుతుంది. సాధారణ అచ్చులోనే సాలు పద్ధతిలో విత్తనాలు దగ్గరగా వేయాలి. ఎకరాకు 4 నుంచి 5 ప్యాకెట్లు విత్తుకోవాలి. 25 వేల నుంచి 33 వేల మొక్కలు ఉండేలా చూసుకోవాలి. 40–45 రోజుల వయసులో ×చమత్కార్× మందును పిచికారీ చేయడం వల్ల పెరుగుదలను నియంత్రించడంతో పాటు పంట ఒకేసారి కాపుకు వస్తుంది. కాయలన్నీ ఒకేసారి పగిలి పంట మొత్తం ఒకేసారి చేతికి వస్తుంది. సాధారణ పద్ధతిలో కన్నా 50 శాతం అధిక దిగుబడి వస్తుంది. రెండో పంట వేసుకోవడానికి అనుకూలంగా ఉండటంతో పాటు గులాబీరంగు పురుగు బెడద ఉండదు.

కబ్జాదారుల ఆటకట్టించిన సీపీ

● హర్షం వ్యక్తం చేస్తున్న ప్రశాంత్‌నగర్ వాసులు


ప్రశాంత్‌నగర్ కాలనీలో ఆక్రమిత స్థలంలో భవనం నిర్మిస్తున్న కబ్జాదారుడు

కాజీపేట: భూకబ్జాదారుపై పోలీస్ కమిషనర్ ఉక్కుపాదం మోపుతున్నారు. తప్పుడు పత్రాలు సృష్టించి ముప్పుతిప్పలు పెడుతున్న వారిపై కేసులు నమోదు చేయించి, జైలుకు పంపడంతో ప్రశాంత్‌నగర్ కాలనీలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. 1981లో రేణుక హౌసింగ్ సొసైటీ ద్వారా కొందరు 18 ఎకరాల భూమి కొనుగోలు చేసి ప్లాట్లు చేసుకుని ఇళ్లు నిర్మించుకున్నారు. పిల్లల చదువులు, పెళ్లిళ్ల వంటి కారణాలతో ఇళ్లు నిర్మించుకోలేక ఖాళీగా ఉన్న పాట్లపై కన్నేసిన కొంతమంది ఓ ముఠాగా ఏర్పడ్డారు. 16 ప్లాట్లను తప్పుడు కాగితాలతో రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. 2014 నుంచి ఈ ముఠా ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండాపోయింది. కబ్జాదారుల చెర నుంచి కాపాడాలంటూ బాధితులు పోలీస్ స్టేషన్ చుట్టూ ప్రదక్షిణ చేసినా పట్టించుకోలేదు. దీంతో ముఠా ఆగడాలు మితిమిరిపోయాయి. బాధితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టించి వేధిస్తున్నారు. సూర కుమారస్వామి అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడి స్థలంలో కేయూ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఓ కానిస్టేబుల్ మూడు అంతస్తుల భవనం నిర్మిస్తున్నాడు. అడ్డుకోవడానికి ప్రయత్నించిన కుమారస్వామిపై కేసు నమోదు చేయించాడు.

కబ్జాదారుల గుండెల్లో రైళ్లు

సీపీ ఏవీ రంగనాథ్ చర్యలతో కబ్జాదారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ప్రశాంత్‌నగర్ కాలనీ వాసులు ఆధారాలతో భూకబ్జాలకు పాల్పడుతున్న వ్యక్తులపై ఫిర్యాదు చేశారు. సీపీ ఆదేశంతో రంగంలోకి దిగిన ఇన్‌స్పెక్టర్ రాజు తన సిబ్బందితో కలిసి విచారణ చేపట్టారు. తప్పుడు పత్రాలు సృష్టించి ప్లాట్ల యజమానులకు కబ్జాదారులు చుక్కలు చూపిస్తున్నట్లు నివేదికను తయారు చేసి సీపీకి అందించారు.

కేసుల నమోదు.. జైలుకు నిందితులు

తప్పుడు పత్రాలు తయారు చేసి 16 ప్లాట్లను విక్రయించి డబ్బు దండుకున్న కేసులో ఇప్పటికే 5గురిని పోలీసులు జైలుకు పంపిచడంతో ప్రశాంత్‌నగర్ కాలనీవాసులు సీపీతో పాటు పోలీసులకు కృతజ్ఞతలు చెబుతున్నారు. కబ్జాదారుల చేతిలో ఉన్న తప్పుడు కాగితాలు రద్దయినప్పుడే బాధితులకు ఊరట కలు గుతుందని కాలనీవాసులు అభిప్రాయపడుతున్నారు.

200 గజాల ప్లాటు కబ్జా



ఎన్నో ఆశలతో కొనుగోలు చేసిన 200 గజాల స్థలాన్ని నిన్న, మొన్న కాగితాలు చేయించుకున్న ఓ కానిస్టేబుల్ ఆక్రమించుకుని మూడంతస్తుల భవనం నిర్మిస్తున్నాడు. మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేస్తే నాపై అట్రాసిటీ కేసు నమోదు చేయించి, మానసిక ఆవేదన కలిగించిండు.

– సూర కుమారస్వామి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

హద్దులు తప్పుగా నమోదు చేశారు..



ఆడ పిల్లల పెళ్లిళ్లకు ఉపయోగపడుతుందని 300 గజాల స్థలాన్ని కొనుగోలు చేశా. దీనిలో 266 గజాల స్థలానికి హద్దులు తప్పుగా నమోదు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్న వ్యక్తి స్థలం మీదకు వచ్చి గొడవ చేశాడు. మానసిక వేదనతో నా భార్య గుండెపోటుతో మరణించి, తీరని దుఃఖాన్ని మిగిల్చింది.

– వాకాటి వెంకటేశ్వర్లు, రిటైర్డ్ ఎస్సై

ప్రభుత్వ ఆస్పత్రిలో బాలింత మృతి..

● వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ బంధువుల ఆందోళన
● వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్


నేహ (ఫైల్)

నెహ్రూసెంటర్ : మానుకోట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఓ బాలింత మృతి చెందింది. ఈ ఘటన శనివారం రాత్రి జరిగింది. మృతురాలి భర్త అనిల్ కథనం ప్రకారం మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలోని సత్యనారాయణపురం గ్రామానికి చెందిన మందుల అనిల్ తన భార్య నేహ(27)ను మొదటికాన్పు నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చాడు. డెలివరీ చేయగా ఆడ శిశువుకు జన్మనిచ్చింది. అనంతరం ఆమెకు అనారోగ్యంగా ఉందని వైద్యులు చికిత్స అందించారు. సెలెన్ స్పీడ్‌గా ఎక్కించడంతో నేహకు చెమటలు వస్తున్నాయని చెప్పగా వైద్యులు, సిబ్బంది ఎవరూ స్పందించలేదు. కొద్ది సమయం తరువాత వైద్యులు వచ్చి వేరే వార్డుకు తీసుకెళ్లి మళ్లీ తీసుకువచ్చారు. అనంతరం నేహ మృతిచెందినట్లు చెప్పారు. దీనిపై వివరణ అడిగితే వైద్యులు, సిబ్బంది పట్టించుకోలేదు. దీంతో నేహ మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ ఆదివారం ఆస్పత్రి గేట్ ఎదుట మృతురాలి భర్త, బంధువులు ఆందోళన చేపట్టారు. ఘటనా స్థలికి చేరుకున్న టౌన్, బయ్యారం సీఐలు సతీష్, బాలాజీ, టౌన్ ఎస్సై రవి.. ఆందోళనకారులకు నచ్చచెప్పి పంపించారు. అనంతరం మృతిరాలి భర్త అనిల్ ఫిర్యాదు మేరకు వైద్యులపై కేసు నమోదుచేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని వారికి అప్పగించారు.


ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు

వినియోగదారుల రక్షణే సీసీఐ ధ్యేయం

● రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్

ఖిలా వరంగల్: వినియోగదారుల హక్కుల పరిరక్షణే కన్స్యూమర్ కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ధ్యేయమని సీసీఐ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచెర్ల సుదర్శన్ అన్నారు. ఆదివారం వరంగల్ శివనగర్‌లోని జిల్లా వినియోగదారుల సమాఖ్య కార్యాలయంలో కార్తీక్ అధ్యక్షతన వినియోగదారుల ఉమ్మడి జిల్లా ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలో బీ.ఐ.ఎస్, ఆహార భద్రత, డైరెక్టరేట్ ఆఫ్ ఫార్మసీ, రాష్ట్రాల లీగల్ మెట్రోలోజీ, ఆహార కల్తీ, నిరోధక శాఖ తదితర శాఖలు వినియోగదారుల రక్షణ నిమిత్తం పనిచేస్తాయని వివరించారు. సేకరించిన వినియోగదారుల సమస్యలను కేంద్ర వినియోగదారుల పరిరక్షణ అథారిటీకి ఫిర్యాదు చేసే అవకాశం కల్పించిన సీసీఐ జాతీయ నేత డాక్టర్ అనంత శర్మ, డాక్టర్ అరుణ్‌కుమార్, దేవేంద్ర తివారీ, ప్రీతి పాండ్యలకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ధరణి పోర్టల్ వ్యవహారంపై 5 ముఖ్యమైన అంశాలపై ఫిర్యాదు చేశామని తెలిపారు. నూతనంగా సీసీఐ కార్డులు పొందే సభ్యులు జిల్లాలోని మొత్తం 3లక్షల ఫిర్యాదుల వివరాలు సేకరించి అందజేయాలని సూచించారు. ఆతర్వాత వినియోగదారుల జిల్లా కమిటీ సభ్యులకు సీసీఐ ఐడీ కార్డులను ఆయన అందజేశారు. ఈ సమావేశంలో మురారిశెట్టి యశ్వంత్‌కుమార్, త్రిపురోజు రవికుమార్, రాగి శ్రీనివాస్, అల్లాది వీరభద్రయ్య, మురహరికార్తీక్, జంపాల ప్రభాకర్, ముస్కుల కిరణ్‌కుమార్, తిరుమల గిరి వెంకటరమణరావు, చిలగాని నరహరి పాల్గొన్నారు.


ఐడీ కార్డులు అందజేస్తున్న సుదర్శన్

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం

కురవి: రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వృద్ధుడు(78) మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి మండల కేంద్రం శివారులోని నర్సరీ వద్ద 365 జాతీయ రహదారిపై జరిగింది. కురవి నుంచి మహబూబాబాద్ వైపు 365 జాతీయ రహదారి పక్క నుంచి గుర్తు తెలియని వృద్ధుడు వెళ్తున్నాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటో డ్రైవర్ వెంకన్న 100కు డయల్ చేసి సమాచారం అందచేశారు.


గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం

కుక్కల దాడిలో పలువురికి తీవ్రగాయాలు

జనగామ రూరల్: ఇంటి ఎదుట పడుకొని ఉన్న ఓ మహిళతోపాటు 10మందికిపైగా జనాలపై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. ఈసంఘటన జనగామ మండలంలోని ఎల్లంల గ్రామంలో శనివారం అర్ధరాత్రి జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. గ్రామంలోని దేవునూరి యాదమ్మ శనివారం రాత్రి ఇంటి ఆవరణలో నిద్రిస్తుండగా కుక్కలు ఒక్కసారిగా ఒకదాని తర్వాత మరోటి ముఖంపై దాడి చేయగా దవడ, తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు తెల్లవారు జామున 3గంటలకు జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. యాదమ్మతోపాటు గ్రామంలోని ఓ రెండేళ్ల బాలికపై కూడా కుక్కలు దాడిచేసి చెవి భాగంగా తీవ్రంగా గాయపర్చడంతో మెరుగైన చికిత్సనిమిత్తం వరంగల్‌లోని ఆస్పత్రికి తరలించారు. గ్రామంలోని మచ్చ రాజు, ఎదునూరి సోమయ్యలకు సైతం తీవ్రంగా గాయాలయ్యాయి. గతంలో కుక్కల బెడద ఉందని స్థానిక ప్రజాప్రతినిధులకు తెలపగా రెండు మూడు కుక్కలను పట్టుకుని.. చేతులు దులుపుకున్నారని గ్రామస్తులు ఆరోపించారు.

రామన్నపేటలో చోరీ..?

రామన్నపేట : వరంగల్ రామన్నపేట ఆర్ ఎన్‌టీ రోడ్డులోని ఓ అపార్టమెంట్‌లో భారీ చోరీ జరిగినట్లు ఆదివారం వాట్సాప్‌లో వైరలైంది. ఓ బంగారు షాపు యజమాని ఇంట్లో సుమారు రూ. 24లక్షల నగదు, కొంత వెండి చోరీ జరిగినట్లు తెలుస్తోంది. ఆ యజమాని 6వ తేదీన ఊరు వెళ్లాడు. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో దుండగులు చోరీకి పాల్పడినట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపై మట్టెవాడ సీఐ వెంకటేశ్వర్లును వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు. ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని సీఐ తెలిపారు.

ప్రయాణికుల చెంతకు ఆర్టీసీ సేవలు

● గ్రామాలకు బస్ ఆఫీసర్లు
● వరంగల్ రీజియన్‌లో 165 మంది నియామకం
● 165 గ్రామాల్లో వీరి సేవలు

హన్మకొండ: ఆర్టీసీని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు యాజమాన్యం సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సంస్థ సేవలను గ్రామాల ముంగిటికి తీసుకెళ్లేందుకు విలేజీ ఆఫీసర్లను నియమించింది. వీరు గ్రామాలకు చేరుకుని ఆర్టీసీ అందిస్తున్న సేవలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ చైతన్యం తీసుకువస్తారు. సంస్థ పరంగా గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని యాజమాన్యం దృష్టికి తీసుకువస్తారు. ఈ మేరకు వరంగల్ రీజియన్‌లో 165 మంది విలేజి బస్ ఆఫీసర్లను నియమించారు. వీరు రీజియన్‌లోని 165 గ్రామాల్లో సేవలు అందిస్తారు. పెద్ద గ్రామాలైతే ఒకరు, చిన్న గ్రామాలైతే రెండు, మూడింటికి కలిపి ఒక ఆఫీసర్‌ను నియమించారు. వీరు శుక్రవారం లాంఛనంగా బాధ్యతలు స్వీకరించారు.

ప్రయాణికులకు, ఆర్టీసీ వారధిగా..

● సంస్థకు.. ప్రయాణికులకు మధ్య విలేజి బస్ ఆఫీసర్స్ వారధిగా పని చేస్తారు.
● వీరికి కేటాయించిన ప్రతి గ్రామంలో ప్రతినెలా రెండు సార్లు గ్రామస్తులతో సమావేశాలు ఏర్పాటు చేస్తారు.
● వారి అవసరాలు, సమస్యలు తెలుసుకుని డిపో మేనేజర్ దృష్టికి తీసుకెళ్లి తీసుకున్న చర్యలను తిరిగి గ్రామస్తులకు వివరిస్తారు.
● ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం, సుఖవంతం, క్షేమంగా గమ్యస్థానానికి చేరుకోవచ్చని చైతన్యం కల్పిస్తారు.
● గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, సంఘ పెద్దలు, మహిళ సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల ఫోన్‌నంబర్లు తీసుకోవడంతోపాటు వీరి నంబర్లు ఇస్తారు.
● గ్రామాల్లో జరిగే పెళ్లిళ్లు, జాతరలు, శుభకార్యాలు తెలుసుకుంటూ వారు అద్దెకు ఆర్టీసీ బస్సులు తీసుకునేలా అవగాహన కల్పిస్తారు.
● సంస్థ అందిస్తున్న రాయితీ పథకాలను వివరించి వాటిని సద్వినియోగం చేసుకునేలా చూస్తారు.


విలేజీ బస్ ఆఫీసర్స్ (ఫైల్)

డిపో వారీగా వివరాలు...


డిపో	విలేజ్ బస్ ఆఫీసర్స్	కేటాయించిన గ్రామాల సంఖ్య
హనుమకొండ	16	48
జనగామ	10	34
వరంగల్-1	14	61
వరంగల్-2	19	19
మహబూబాబాద్	12	12
నర్సంపేట	24	46
పరకాల	21	24
తొర్రూరు	28	68
భూపాలపల్లి	21	21

చికిత్స పొందుతున్న యువకుడి మృతి


అశోక్(ఫైల్)

వాజేడు : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న ఓ యువకుడు ఆదివారం మృతి చెందాడు. మండలంలోని గుమ్మడి దొడ్డి గ్రామానికి చెందిన నాంపల్లి అశోక్(23) ఛత్తీస్‌గఢ్‌లో బైక్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి ఛత్తీస్ గఢ్ నుంచి ఇంటికి వస్తుండగా చందూర్–దుద్దేడ సమీపంలో బైక్‌కు అడవి జంతువు అడ్డు వచ్చింది. దానిని తప్పించే క్రమంలో బైక్ కింద పడింది. దీంతో అశోక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. తానే 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి సమాచారం అందించగా వారు ఏటూర్ నాగారం సివిల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అశోక్ మృతి చెందాడు. చేతికి అందివచ్చిన కొడుకు మృతి చెందడంతో మృతుడి కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

నర్సంపేటలో డిగ్రీ విద్యార్థి..


ఇమ్రాన్ మృతదేహం

గీసుకొండ: డబ్బు చెల్లించాలని స్నేహితులు వేధించడంతో ఓ యువకుడు ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన ఎస్‌కే ఇమ్రాన్ (19) హన్మకొండలోని వాగ్దేవి కళాశాలలో డిగ్రీ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. హన్మకొండలోనే అఖిల్, కల్యాణ్, నవీన్ అనే ముగ్గురితో కలిసి ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. రెండు నెలల క్రితం ఇమ్రాన్‌కు రూ. 1.50 లక్షలు ఇచ్చామని, చెల్లించాలని ఆ ముగ్గురు..ఇమ్రాన్ లాప్‌టాప్, ద్విచక్ర వాహనాన్ని లాక్కున్నారు. విషయం తెలిసిన అతడి తల్లి వారికి డబ్బు చెల్లించి బైక్, లాప్‌టాప్‌ను తీసుకుని కుమారుడికి ఇచ్చింది. ఇది జరిగిన తర్వాత కూడా ఇమ్రాన్‌ను తమకు డబ్బు ఇంకా చెల్లించాలని, లేదంటే చనిపో అంటూ వేధించేవారు. శనివారం హాల్ టికెట్ తీసుకుని వస్తానని ఇమ్రాన్ బైక్‌పై వెళ్లగా లాక్కున్నారు. దీంతో హన్మకొండ నుంచి నర్సంపేటకు బస్సులో వెళుతున్న క్రమంలో ఇమ్రాన్ మార్గ మధ్యలో కొమ్మాల సింహద్వారం వద్ద దిగాడు. అనంతరం కొమ్మాల లక్ష్మీనర్సింహాస్వామి ఆలయ సమీపంలో మధ్యాహ్నం పురుగుల మందు తాగాడు. అనంతరం నర్సంపేటకు వెళ్లి తన తల్లికి విషయం చెప్పడంతో వెంటనే అతడిని నర్సంపేట ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం వరంగల్ ఎంజీఎంలో చేర్పించగా చికిత్స పొందుతూ అదే రోజు మృతి చెందాడు. ముగ్గురు స్నేహితుల వేధింపులతోనే ఇమ్రాన్ ఆత్మహత్య చేసుకున్నాడని, వారిపై చర్యలు తీసుకోవాలని మృతుడి తాత ఎండీ యాకూబ్‌అలీ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని గీసుకొండ ఎస్‌ఐ వెంకన్న తెలిపారు.



అందాల సీతాకోక చిలుక..

కొత్తగూడ: అరుదైన అందమైన సీతాకోక చిలుక మండల కేంద్రంలోని దేవర రాము ఇంటి వద్ద కనువిందు చేసింది. సుమారు అయిదు ఇంచుల పొడవు నాలుగు ఇంచుల వెడల్పుతో తెల్లటి రంగు, దానిపై నాలుగు కళ్ల ముద్రలతో అందగా ఉన్న సీతాకోక చిలుకను స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

విద్యుదాఘాతంతో గేదెల మృత్యువాత

నెల్లికుదురు : విద్యుదాఘాతంతో నాలుగు పాడి గేదెలు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన ఆదివారం మండలంలోని మునిగలవీడులో జరిగింది. గ్రామానికి చెందిన కొమ్మనబోయిన మల్లయ్య, రాజు, జంపాల ముఖేశ్, ఉప్పరబోయిన రాములు పాడి గేదెలు గ్రామ శివారులో వ్యవసాయ పొలాల్లో మేస్తున్నాయి. ఈక్రమంలో శనివారం రాత్రి వీచిన ఈదురు గాలులకు తెగిపడిన 11కేవి విద్యుత్ తీగలకు తగిలి నాలుగు అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. విషయం తెలుసుకున్న సర్పంచ్ నవీన్ రావు విద్యుత్ అధికారులు, పశువైద్యాధికారులతో ఫోన్‌లో మాట్లాడి బాధితులకు న్యాయం చేయాలని కోరారు.


గేదెలను పరిశీలిస్తున్న సర్పంచ్, బాధితులు

తగ్గని వేసవి తీవ్రత

● నేటినుంచి రెండు పూటల బడులు
● ఎండలతో విద్యార్థులకు ఇబ్బందులే..

విద్యారణ్యపురి : వేసవి తీవ్రత ఏమాత్రం తగ్గలేదు. ఎండలు మండిపోతున్నాయి. ప్రజలు ఉక్కపోతతో సతమతమవుతున్నారు. ఈక్రమంలో సోమవారం నుంచి అన్ని యాజమాన్యాల పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపేందుకు సిద్ధం అయ్యారు. కానీ, ఉష్ణోగ్రతలుఇలాగే ఉంటే పిల్లలను పాఠశాలలకు పంపుతారా అనే ప్రశ్న తలెత్తుతోంది. ఒకవేళ పాఠశాలలకు పంపినా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. లేకపోతే పిల్లలు ఇబ్బందులు పడే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా వాటర్ బాటిల్స్‌ను పంపించాలి. ఎండలను దృష్టిలో ఉంచుకొని వారం రోజుల పాటు ఒక్క పూటబడి నిర్వహిస్తే బాగుంటుందనేది అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఏపీలో ఒక్కపూట బడులు కొనసాగించేందుకు అక్కడి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కానీ, తెలంగాణలో మాత్రం రెండు పూటల బడులు కొనసాగుతాయని విద్యాశాఖ ఇప్పటికే స్పష్టం చేసింది. హనుమకొండ జిల్లాలో అన్ని యాజమాన్యాల పాఠశాలలు సోమవారం నుంచి రెండు పూటలు యథావిధిగానే నడుస్తాయని డీఈవో ఎండీ.అబ్దుల్‌హై ఆదివారం తెలిపారు.